క్లుప్తంగా

పాడి పశువులకు టీకాలు

నింద్ర: మండలంలోని రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని అరూరు పశువైద్యఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. మండలంలోని పాదిరి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడం వలన ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



ఎస్ఐకి సన్మానం చేస్తున్న పార్టీ నాయకులు

విజయపురం: మండల కేంద్రంలోని ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కే రంగను వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సన్మానించారు. ఎస్ఐని సన్మానించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శివరాజు, సర్పంచ్ కుమార్, బాబు, రాజాదాస్ ఉన్నారు.

పంచాయతీల్లో తాగునీటి లీకేజీ పనులు

నింద్ర: మండలంలోని గ్రామ పంచాయతీల్లో తాగునీటి లీకేజీ ఉన్న చోట బుధవారం మరమ్మతులు చేశారు. పారిశుధ్య పనులు కూడా చేపట్టారు. గ్రామాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధరణి మరమ్మతుల పనులను పరిశీలించారు.

లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో ఉన్న పురాతన కామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం: జర్నలిస్టుల సమస్యల పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే థామస్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్‌పురంలో ప్రెస్‌క్లబ్, ఏపీయూడబ్ల్యూజే కార్యాలయం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేకర్లకు ఇంటి స్థలం మంజూరు చేయిస్తామని, ప్రెస్‌క్లబ్ భవనానికి స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కాళీ, ప్రతినిధులు కరీమ్, జయప్రకాష్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సత్కారం



రమేష్‌ను సన్మానిస్తున్న నేతలు, సచివాలయ సిబ్బంది

వెదురుకుప్పం: మండలంలోని కాపు మొండివెంగనపల్లె పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. గ్రేడ్ 4 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందడంతో మాజీ సర్పంచ్ బట్టే చాణక్య ప్రతాప్, సచివాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణపల్లె వీఆర్ఓ దనశేఖర్, గ్రామ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

పూదోట.. లాభాల బాట


- మల్లెపూలకు మంచి గిరాకీ
- సాగుపై మక్కువ చూపుతున్న రైతులు
- తప్పని దళారుల బెడద



తిమ్మాపురంలో సాగైన మల్లె తోట



తిమ్మాపురంలో మల్లె పూలు కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్) మల్లెలు



పుత్తూరు: పుత్తూరు ప్రాంత రైతులకు మల్లెపూలు లాభాలు పూయిస్తున్నాయి. మల్లెసాగు లాభదాయకంగా ఉండడంతో ఈ తోటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. అధిక పెట్టుబడుల అవసరం లేకుండా ఏడాదిలో ఏడెనిమిది నెలల పాటు నిరంతరం ఆదాయాన్ని అందిస్తున్న ఈ మల్లె తోటలు పుత్తూరు మండలంలో ఏటా విస్తరిస్తున్నాయి. కొత్తగా సాగు చేసిన తోట ఓసారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడిని ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కలు నాటిన తర్వాత తగిన మోతాదులో ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. మొగ్గలు వచ్చే సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు వరకు ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఈ తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతల వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులు ధీమాగానే ఉంటారు. మల్లెపూల సీజన్ మార్చితో మొదలై అక్టోబర్ నెల వరకు ఉంటుంది. మొల్లలు మాత్రం ఏప్రిల్ చివరి వారం నుంచి పూయడం మొదలవుతాయి. తొలి మూడు మాసాల్లో ఒక కేజీ రూ.300 నుంచి 500 వరకు ధర పలుకుతుంది. పూలు కోయడానికి వచ్చే కూలీలకు కేజీకి రూ.20 చెల్లిస్తుంటారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్, తిమ్మాపురం, పిళ్లారిపట్టు, కల్యాణపురం, వినాయకపురం ప్రాంతాల్లో మల్లె తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. అయితే తాము పండించిన పూలకు తామే ధర నిర్ణయించే స్థితిలో లేకపోవడం పట్ల పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూల మార్కెట్‌కు తప్పని దళారుల దోపిడీ

అన్ని మార్కెట్లకు ఉన్నట్లే పూల మార్కెట్‌లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. పుత్తూరు పట్టణంలో ముగ్గురు పూల వ్యాపారులు ఉన్నారు. వీరు పల్లెల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలు కొనుగోలు చేస్తారు. కొనుగోలు సమయంలో రైతుకు ధరను చెప్పకుండా, ఒక పుస్తకంలో ఎన్ని కిలోలు కొనుగోలు చేసింది మాత్రం నమోదు చేస్తారు. నెలకోసారి మొత్తం కేజీలకు డబ్బు చెల్లిస్తారు. మల్లెల సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధరను చెల్లిస్తుండడంతో రైతులు దారుణంగా నష్ట పోతున్నారు. ఈ దళారులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ వ్యవస్థను సమూలంగా రూపుమాపుతూ పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని పూల రైతులు కోరుతున్నారు.

ఆర్థిక వనరుల వేలం రేపు

కార్వేటినగరం: పంచాయతీ ఆర్థిక వనరులకు శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ నాగరత్నమ్మ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కార్వేటినగరంలో ప్రతి గురువారం జరిగే వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతువధ శాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు ముందస్తుగా డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

'పోషణ్‌బీ- పడాయిబీ'పై శిక్షణ



మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వరి

గంగాధర నెల్లూరు: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు పోషణ్‌బీ- పడాయిబీపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళ శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లలకు సమగ్రంగా పోషకాహారం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ వినత శ్రీ, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ కుమార్

విజయపురం: ఉపాధి కూలీలకు సంబంధించి రెండు నెలల పెండింగ్ వేతాలు ఇవ్వాలని పన్నూరు సర్పంచ్ కుమార్ డ్వామా పీడీ రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండల కేంద్రంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీవో రాజేందర్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు. ముందుగా మొత్తం 25 పంచాయతీలకు సంబంధించిన పనుల వివరాలను చదవి వినిపించారు. గత ఏడాది వివిధ పనుల కోసం రూ.7.11కోట్ల ఖర్చు చేశారు. అందులో రూ.32,664 అవినీతి జరిగినట్లు తేలడంతో, రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పన్నూరు, విజయపురం దళితవాడలో రాజకీయ కక్ష సాధింపుతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంపై సర్పంచ్ కుమార్, ప్రసన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సర్పంచ్ తీర్మానం లేకుండా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లు, గ్రావెల్ రోడ్లు వేశారని తెలిపారు. దీనిపై స్పందించిన పీడీ విచారణ చేపట్టి న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బబిత, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు వాడితే అనర్థాలు



మాట్లాడుతున్న ఏఎస్ఐ సుబ్రమణ్యంనాయుడు

వెదురుకుప్పం: మాదక ద్రవ్యాల వాడితే అనేక అనర్థాలు తలెత్తుతాయనిఏఎస్ఐ సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. బుధవారం చవటగుంటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వినియోగంతో వాటిల్లే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలను వాడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ చెడు అలవాట్లకు లోనై జీవితాలను పాడు చేసుకోకూడదని సూచించారు. ఆరోగ్యకర సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థి దశలోనే అన్ని అలవాట్లను దూరం చేసుకుని భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు కంకణబద్ధులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వేలు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేశు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మంగళగౌరి, ప్రభాకర్‌రావు, భరణీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సమావేశంలో ఖాళీ కుర్చీలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక జనం లేక విలవిలపోయింది. అధికారులు తూతూ మంత్రంగా సమావేశం ముగించేశారు. ఇటీవల 22 పంచాయతీల్లో 17వ విడత సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. ఎంపీడీవో శేషగిరావు ఆధ్వర్యంలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. దీనికి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ హాజరయ్యారు. సామాజిక తనిఖీల వివరాలను అధికారులు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 754 ఉపాధి పనులకుగాను రూ.9.85కోట్లు ఖర్చు చేశారు. అందులో కేవలం రూ.1000 అవినీతి జరిగినట్లు నిరూపించి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రజావేదిక కార్యక్రమంలో కేవలం అధికారులు, ఉపాధి సిబ్బంది తప్ప జనం లేకపోవడంపై పలువురు విమర్శలు గుప్పించారు. ఏపీడీ వరప్రసాద్, ఏపీవో గణేష్, ఏపీవో సుజాత, హంసవేణి పాల్గొన్నారు.

ముందస్తు రంజాన్ వేడుకలు



మాట్లాడుతున్న మతపెద్ద షౌకత్ అలీ

పుత్తూరు: స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో బుధవారం ముందస్తు రంజాన్ వేడుకలు నిర్వహించారు. మహిళా పొదుపు సంఘాల సభ్యులచే ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మత పెద్దలు షౌకత్ అలీ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటూ దానధర్మాలు చేస్తుంటారని తెలిపారు. పండుగలు మన జీవన విధానాన్ని, జాతీయతను తెలియజేస్తుంటాయన్నారు. పండుగ ఏదైనా దాని వెనుక మంచి సందేశం ఉంటుందని చెప్పారు. రాస్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు రహ్మతుల్లా, హబీబ్, రాస్ అధికారి రవి, సిబ్బంది శేఖర్, తేజ, ఏకాంబరం పాల్గొన్నారు.

నలుగురు గైర్హాజరు

గంగాధర నెల్లూరు: మండలంలో బుధవారం నిర్వహించిన పదోతరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు మొత్తం 694 మంది విద్యార్థులకు గాను 690 మంది హాజరైనట్లు ఎంఈఓ ఆంజనేయులుశెట్టి తెలిపారు. నలుగు రు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

పుత్తూరులో 8 మంది

పుత్తూరు: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా మండలంలో బుధవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 8 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ తిరుమలరాజు తెలిపారు. మొత్తం 1436 మంది విద్యార్థులకు గాను 1428 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. మండల పరిధిలోని 10 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

పాలల్లో కల్తీని అరికట్టాలి

కార్వేటినగరం: ప్రజలు నిత్యం వినియోగించే పాలల్లో జరుగుతున్న కల్తీని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్వేటినగరంలోని ఓ ప్రైవేటు పాలసేకరణ కేంద్రం వారు నాణ్యత లేని కల్తీపాలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై జిల్లా ఆహార పదార్థాల కల్తీ నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. ఈ క్రమంలోనే పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసినట్లు వివరించారు. పాడి రైతులను వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడాలని కోరారు. పాడి ఆవుల కొనుగోలుకు ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు ఇప్పించాలని సూచించారు.

ఎమ్మెల్యే ప్రోగ్రామ్‌లో అపశ్రుతి



కాలిపోతున్న షామియానా

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ రంగాపురంలో బుధవారం జరిగిన ఎమ్మెల్యే థామస్ ప్రోగ్రామ్‌లో అపశ్రుతి చోటు చేసుకుంది. వివరాలు.. బలిజకండ్రి– బెంగళూరు ప్రైవేట్ బస్సు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు బాణసంచా పేల్చడంతో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పడి షామియానా అంటుకుంది. దీంతో స్థానికులు మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో నేతలు అక్కడ నుంచి పరుగులు తీశారు. ఘటన విషయం తెలుసుకున్న టీడీపీలోని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు సంతోషపడినట్లు సమాచారం. ఎమ్మెల్యే కార్యక్రమం కాస్తా అభాసుపాలు కావడంతో సంబరాలు జరుపుకున్నట్లు తెలిసింది.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు





ఆళ్లమడుగులో..., తార్లబైలులో బోరు వేయిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు మురళీరెడ్డి

వెదురుకుప్పం : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూస్ ఏఈ గాయత్రి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరతను నివారించేందుకు కొత్తగా బోర్లు వేయిస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ నిధులతో తాగునీటి ఎద్దడికి చెక్ పెట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీపీ నాగరాణి సైతం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. దీంతో ఆర్‌డబ్ల్యూస్ అధికారులు నీటి కొరత ఉన్న గ్రామాల్లో జియాలజిస్ట్ ద్వారా పాయింట్లను గుర్తించి తక్షణమే బోర్లు వేసేందుకు చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఆళ్లమడుగు ఎస్సీ కాలనీ, తార్లబైలు, తిరుమలయ్యపల్లె పంచాయతీలోని బాలుపల్లె, పెద్దపోటుచేను ఆది ఆంధ్ర వాడ, పచ్చికాపల్లం లేఔట్‌లో కొత్తగా బోర్లు వేయిస్తున్నట్లు ప్రకటించారు. తార్లబైలు సమీపంలోని పాలమడుగు ఎంపీటీసీ సభ్యుడు మురళీ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తోకల మురళీరెడ్డి (పెరుమాళ్లపల్లె), రమణమ్మ(ఆళ్లమడుగు), సర్పంచ్ భారతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి, స్థానిక నేత వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఈ మలుపు ప్రమాదాలకు పిలుపు



ఏఎంపురం మలుపులో సూచిక బోర్డు లేని దృశ్యం



వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ నుంచి బట్టీకండ్రిగ గ్రామానికి వెళుతున్న మార్గంలో 10 చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో రోజుకు వద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. మలుపు వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో వాహన చోదకులు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. సూచిక బోర్డు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మలుపుల వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నారు.

దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి



ర్యాలీ చేస్తున్న నెత్తం దళితవాడ గ్రామస్తులు

నగరి: తాము నివాసం ఉంటున్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి తొమ్మిదవ వార్డు నెత్తం కండ్రిగ దళితవాడ వాసులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేసి, అక్కడ నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సుమారు 80 కుటుంబాలు పూరిళ్లల్లో జీవిస్తున్నాయన్నారు. వీరు నివాసం ఉన్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆర్డీవో భవానీ శంకరి మాట్లాడుతూ స్థలాలను సర్వేచేసి అర్హులకు తప్పనిసరిగా పట్టాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు బాషా, విజయ్ కుమార్, గ్రామ కమిటీ నాయకులు యేసయ్య ముత్తు బాబు కృష్ణమూర్తి, కుప్పయ్య, బాబు, సురేష్ రాజు, వేలు, జేమ్స్, మేరీ, భారతి, కాంచన, ఐశ్వర్య, లైలా, కుందెమ్మ, రాణి పాల్గొన్నారు.

నేడు వారపు సంత వేలం

గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు వారపు సంతతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ రూములకు గురువారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగలవారు వారపు సంత కోసం రూ.1.25లక్షలు, షాపింగ్ కాంప్లెక్సులో రూమ్ కోసం రూ.10వేల డిపాజిట్‌ను డీడీ రూపంలో ముందస్తుగా సమర్పించాలని సూచించారు.

వారికి ఆదాయం.. మాకు అనారోగ్యం

- ఉత్పత్తి తమిళనాడులో రసాయనాలు నగరిలోనా?
- భావితరాలకు ఆస్తులను కాదు.. ఆరోగ్యాన్ని ఇద్దాం
- అఖిలపక్ష ఆలోచనా సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న దళిత్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు

నగరి: నిషేధించిన డైయింగ్ యూనిట్ల వల్ల తమిళనాడు వాసులకు ఆదాయం వస్తుంటే, నగరివాసులకు అనారోగ్యం వాటిల్లుతోందని దళిత పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రసాయన రంగునీటికి వ్యతిరేకంగా బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో దళిత్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు ఎ.గజేంద్ర ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన వివిధ పార్టీల నేతలు తమ ఆలోచనలతో పాటు ఆగ్రహాన్ని కూడా వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రసాయనాల నడుమ నివాసమున్నామని చెప్పారు. ఒకప్పుడు కుశస్థలి నదిలో ఉన్న చలమల్లో స్నానం చేసి పక్కనే కూర్చుని భోంచేసేవారమన్నారు. నేడు నది పక్కన నడచి రావాలన్నా భయమేస్తోందని, రసాయనాల కంపు భరించలేకపోతున్నామన్నారు. నదితో పాటు, చెరువులు, నీటిపారుదల కాలువలు, గుంటలు అన్నీ కలుషితమైపోయాయని చెప్పారు. బోర్లు వేసినా రసాయనాలు కలిసినా నీరే వస్తుందన్నారు.

నగరి నుంచి విజయపురం మండలం దాటి తమిళనాడు సరిహద్దు వరకు ఇదే పరిస్థితి ఉందన్నారు. తమిళనాడులో ప్రజలకు హాని కలుగుతుందని నిషేధించిన డైయింగ్ యూనిట్లకు ఇక్కడ ఎలా అనుమతి ఉంటుందన్నారు. ఇది హాని అని తమిళనాడు ప్రభుత్వానికి తెలిసినపుడు మన ప్రభుత్వానికి, ఇక్కడి అధికారులకు ఎందుకు తెలియడంలేదని ప్రశ్నించారు. నిషేధించిన డైయింగ్ యూనిట్ల యజమానులు నగరి పట్టణంలో నూలుకు రంగులు వేసి రసాయనాలను నగరి ప్రజలపై వదలి సురక్షితంగా నూలును తీసుకెళ్లిపోతున్నారని చెప్పారు. నేడు వీధి వీధికి కిడ్నీ బాధితులున్నారంటే అది డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయనాలవల్లే అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే డైయింగ్ యూనిట్లు పూర్తిగా మూతబడాలన్నారు. దానికి ప్రజల్లో మార్పురావాలని పేర్కొన్నారు. ఇది మనకోసం మనం చేసే పోరాటమని ప్రజలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. అప్పుడే భావితరాలకు ఆస్తులకన్నా విలువైన ఆరోగ్యాన్ని ఇచ్చేవీలుంటుందన్నారు.

అంచెలంచెలుగా నిరసన

డైయింగ్ యూనిట్లు శాశ్వతంగా మూసివేసేందుకు అంచెలంచెలుగా నిరసనలు వ్యక్తం చేయాలని అఖిల పక్ష సమావేశంలో నిర్ణయించారు. తొలుత నిరసనలు ఆపై ర్యాలీలు, దీక్షలు, ముట్టడి అంటూ రసాయన రంగునీటి వ్యతిరేక పోరాటం చేసేందుకు నేతలు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ మొదటివారంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరత్నం రెడ్డి, రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోవిందస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, సీపీఎం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్, యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అమృతరాజ్ నాడార్, నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నాగూర్, మైనార్టీ నాయకులు సలీం, కౌన్సిలర్లు ఇంద్రయ్య, బిలాల్, ఎల్లప్పరెడ్డి, మునివేలు పాల్గొన్నారు.